www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | ఆది వారం, 28 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-136 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## దేశంలో వనరలు వినియోగంలో కేంద్రం విఫలం

- రైతు సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర పాలకులు
- అమెరికా,చైనాకన్నా సారవంతమైన భూములు ఉన్నాయి
- 40కోట్ల ఎకరా భూములకు సరిపడా నీటి వనరులు
- మానవ వనరులు కూడా మన దేశంలోనే ఎక్కువ
- తెలంగాణలో అమలు చేస్తుంటే దేశంలో ఎందుకు అమలు చేయరు
- వివిధ రాష్ట్రాల రైతు సంఘాల నేతలతో సిఎం కెసిఆర్ సమీక్ష
- రైతు ప్రతినధుల అభిప్రాయలు, సూచనలు స్వీకరించిన కెసిఆర్



**హైదరాబాద్, ఆగస్ట్ 27 (సమ సమాజం):** దేశంలోని వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే అవకాశం ఉన్నా ఆ దిశగా కేంద్రం చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమయ్యిందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఉన్న వనరులను కూడా వినియోగించుకోలేని దుస్థితిలో దేశ పాలకులు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వనరులను సరిగా వినియోగించుకుంటూ దేశ సౌభాగ్యాన్ని గుణాత్మకం గా అభివృద్ధి చేసి.. రైతు, వ్యవసాయం, సంక్షేమం దిశగా సాగే సుపరిపాలన కోసం అడుగులు వేయాల్సి ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సంఘాల నేతలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా ఇంకా కొన్ని వర్గాల ప్రజలు తమ ఆకాంక్షల కోసం ఎందుకు పోరాటం చేయాల్సి వస్తోందని నిలదీశారు. ప్రభుత్వ విధానాలు, ఆలోచనలు, భవిష్యత్ కార్యాచరణ, దేశ వ్యవసాయ రంగంలో రావాల్సిన మార్పులు, రైతుల కోసం తీసుకోవాల్సిన చర్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సంఘాల నేతలకు వివరించారు. ఆ నేతల అభిప్రాయాలనూ తీసుకున్నారు. అమెరికా, చైనా వంటి ఏ దేశాలతో పోల్చి చూసినా నీటి వనరులు, వ్యవసాయయోగ్య భూమి, మానవ వనరులు భారత్‌లోనే పుష్కలంగా ఉన్నాయని సీఎం వివరించారు. దేశంలోని 40 వేల కోట్ల ఎకరాల సాగుయోగ్యమైన భూమికి 40 వేల టీఎంసీల నీళ్లు మాత్రమే అవసరమని.. తాగునీటికి 10 వేల టీఎంసీలైతే సరిపోతాయని పునరుద్ఘాటించారు. 70 వేల టీఎంసీల నీటి వనరులు దేశంలో అందుబాటులో ఉన్నా ఎందుకు సాగు, తాగునీరు కోసం ప్రజలు ఇంకా ఎదురు చూడాల్సి వస్తోందని కేసీఆర్ ప్రశ్నించారు. 4 లక్షల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్నా.. 2 లక్షల మెగావాట్లు వినియోగించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయం, సాగునీరు, విద్యుత్ రంగం అభివృద్ధి, రైతు సంక్షేమ కార్యక్రమాలతో పాటు వివిధ రంగాల్లో ప్రగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన కర్షక సంఘాల నేతలు ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. వ్యవసాయం, సాగునీటి రంగంలో తెలంగాణ సాధించిన ప్రగతిపై రూపొందించిన డాక్యుమెంటరీని తిలకించిన నేతలు.. క్షేత్రస్థాయి పరిశీలనకు

3వ

## సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా యూయు లలిత ప్రమాణం

ప్రమాణ స్వీకారం చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

హాజరైన ప్రధాని మోడీ, రామ్‌నాథ్ కోవింద్, వెంకయ్య, ఎన్వీ రమణ



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 27 (సమ సమాజం):** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఉదయ్ ఉమేష్ లలిత్ 49వ సీజేఐగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము యూయూ లలిత్ చే ప్రమాణ స్వీకారం చేయించారు. లలిత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా 65ఏళ్ల వయస్సు వరకు కొనసాగుతారు. ఈయన పదవీ కాలం నవంబర్ వరకు మాత్రమే ఉండనుంది. అంటే లలిత్ 74 రోజులు మాత్రమే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగనున్నారు. జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్ 1957 నవంబరు 9న జన్మించారు. 1983 జూన్‌లో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించిన లలిత్... 1985 డిసెంబరు వరకు బాంబే హైకోర్టులో ప్రాక్టీసు చేశారు. ఆ మరుసటి ఏడాది ఆయన సుప్రీంకోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. 2014 ఆగస్టు 13న సుప్రీంకోర్టు జడ్జిగా

3వ

## కొట్టుకు చావమని ఏ దేవుడు చెప్పాడు

స్టడీ మెటీరియల్ విడుదల సందర్భంగా మంత్రి కెటిఆర్



**హైదరాబాద్, ఆగస్ట్ 27 (సమ సమాజం):** దేశంలో, రాష్ట్రంలో మత విద్వేషాలను సృష్టిస్తున్న నాయకులపై టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఏ దేవుడు చెప్పిండు.. తన్నుకు చావండని కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. అర్థం కాని విషయం ఏంటంటే.. ఏ దేవుడు చెప్తున్నాడు తన్నుకు చావండని. ఏ మతం దేవుడైనా చెప్పిండా? అని ప్రశ్నించారు. కృష్ణుడు చెప్పిండా? రాముడు చెప్పిండా? యేసుక్రీస్తు చెప్పిండా? అల్లా చెప్పిండా? నా మనషులను పంపిస్తున్న భూమి మీదకు.. ఒకరికొకరు తన్నుకు చావండి.. ఎవరి దేవుడు గొప్ప అనే కాంపిటీషన్ పెట్టుకొని తన్నుకు చావండి అని చెప్పిండా? అని కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. ఎందుకు కొట్లాడుతున్నాం.. ఎవరి కోసం కొట్లాడుతున్నాం. ఏ కారణం చేత కొట్లాడుతున్నాం మనం. దేని మీద దృష్టి పెట్టాలి. అసలు మనం దేని మీద పని చేస్తున్నాం. ఈ దేశంలో నీళ్లు లేవని ఒకరు ఏడుస్తుంటే.. తిండి లేక చస్తుంటే, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇంటికి నిన్న గాక మొన్న కరెంట్ వస్తే.. దాని మీద మనకు సోయి లేదు. ఏ దేవుడు గొప్ప? అని ప్రశ్నించుకుంటున్నారు. నన్ను అడిగితే మా అమ్మ గొప్ప అని చెబుతాను. ఎవరి అమ్మ గొప్పది అనే కాంపిటీషన్‌కు అర్థముందా? ఎవరి అమ్మ గొప్ప? ఎవరి దేవుడు గొప్ప? అనే ప్రశ్నకు సమాధానం దొరుకుతుందా? అవకాశం ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. మతాల మీద పడి మనం ఎక్కడ్నో పోతున్నాం. చైనా వాడేమో 16 ట్రిలియన్ డాలర్లకు చేరిండు. మనం ఏమో 3.1 ట్రిలియన డాలర్ల

3వ

## టిఆర్ఎస్‌ను సాగనంపడమే సంగ్రామ యాత్ర లక్ష్యం

- కెసిఆర్ నయా నిజాంలా తయారయ్యాడన్న జెపి నడ్డా
- సభ జరపుకోవడానికి ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొన్నాం
- అవినీతిలో కూరుకుపోయిన కెసిఆర్ సర్కార్
- ఢిల్లీ దాకా పాకిన కెసిఆర్ కుటుంబ అవినీతి
- ఎటిఎంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్ట్
- అవినీతి కెసిఆర్‌ను వదిలే ప్రసక్తే లేదు
- ఎంతగా అడ్డుకున్నా వెంటపడుతూనే ఉంటాం
- పోరాడి సాధించుకున్న తెలంగాణ కెసిఆర్ కుటుంబానికా
- బిజెపి యాత్రను అడుగడుగునా అడ్డుకున్నారు
- కేంద్రం నిధులు ఇస్తున్నా దబాయింపులా
- అబద్దాలు చెబుతూ దుమ్మెత్తి పోయడమేనా
- వేలకోట్లు ఇచ్చిన లెక్కలు వివరించిన కిషన్ రెడ్డి
- దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్
- ఎంఐఎంతో కుమ్మక్క దాడులకు తెగించారు
- దమ్ముంటే అభివృద్ధిపై కెసిఆర్ చర్చకు రావాలి
- కెసిఆర్ చర్యలతో రక్తం సలసల మరుగుతోంది
- హన్మకొండ సభలో నిప్పులు చెరిగిన బండి సంజయ్
- ఎన్ని అడ్డంకులు సృష్టించిన బిజెపిని అడ్డుకోలేరు
- తెలంగాణలో బిజెపి జెండా ఎగరడం ఖాయం
- రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే
- కెసిఆర్ హామీలను మరచి కుటుంబకోసం పాటుపడ్డారు
- హన్మకొండ సభలో నిప్పులు చెరిగిన ధర్మపురి అర్వింద్



**హన్మకొండ, ఆగస్ట్ 27 (సమ సమాజం):** కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడమే ప్రజా సంగ్రామయాత్ర లక్ష్యమని భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. తెలంగాణలో కేసీఆర్ ఒక నయానిజాం వలే వ్యవహరిస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బండి సంజయ్ పాదయాత్ర ముగింపు సందర్భంగా హన్మమకొండలో ఏర్పాటు చేసిన భాజపా భారీ బహిరంగ సభలో తెరాస ప్రభుత్వంపై నడ్డా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వరంగల్ ప్రజలకు నమస్కారాలు అంటూ జేపీ నడ్డా ప్రసంగం మొదలు పెట్టారు. భద్రకాళీ అమ్మవారిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ప్రజా సంగ్రామ యాత్ర ముగింపు సభకు రావడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. ముగింపు సభను అడ్డుకోవడానికి టీఆర్ఎస్ ప్రభుత్వం చాలా కుట్రలు చేసిందన్నారు. కానీ, హైకోర్టు అనుమతితో సభ ఏర్పాటు చేశామని చెప్పారు. తాను హైదరాబాద్?లో అడుగు పెట్టినప్పటి నుంచి అడుగడుగునా అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ప్రజలు సభకు రాకుండా అడ్డుకునే కుట్రలు చేశారని విమర్శించారు. టీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అంధకారంలో ఉందని జేపీ నడ్డా అన్నారు. తెలంగాణ లక్షల కోట్ల అప్పుల్లో కూరుకు పోయిందన్నారు. కేసీఆర్ అవినీతి ఢిల్లీ వరకు కూడా పాకిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కు ఏటీఎంలా మారిందని ఆరోపించారు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ కుటుంబం వేల కోట్లు దోచుకుందన్నారు. రూ.40వేల కోట్ల అంచనాతో కాళేశ్వరం ప్రాజెక్టును మొదలు పెట్టిన కేసీఆర్ సర్కారు.. ప్రాజెక్టు పూర్తయ్యే సరికి రూ.లక్ష 40 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని కేసీఆర్ బందీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో రానున్న రోజుల్లో బీజేపీ

3వ

## కెసిఆర్ సంక్షేమాన్ని దెబ్బతీస్తున్న బిజెపి

- వైషమ్యాలు రెచ్చగొట్టేలా ప్రకటనలు
- రైతు సంక్షేమంలో తెలంగాణనే ముందంజ
- పెన్షన్లు కూడా తెలంగాణలోనే ఎక్కువ
- అందుకు తెలంగాణపై బిజెపి కుట్రలు
- మండిపడ్డ మంత్రి జగదీశ్ రెడ్డి



**సూర్యాపేట, ఆగస్ట్ 27 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తుంటే..బీజేపీ మాత్రం ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతోందని మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. కేసీఆర్ చేపట్టిన రైతు సంక్షేమ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా రైతు సంఘాలు మెచ్చుకుంటున్నాయని చెప్పారు. కేసీఆర్‌పై అక్కసుతో రాష్ట్ర సంక్షేమాన్ని చీకట్లోకి నెట్టేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. తమ సిద్ధాంతాలను వ్యతిరేకించే రాష్ట్ర ప్రభుత్వాలను బీజేపీ కూల్చే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. 8 ఏండ్లలో మోడీ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే క్రమంలో ప్రశ్నించే వారిని బీజేపీ అణగదొక్కే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టబద్ధ సంస్థలను దుర్వియోగ పరుస్తూ.. దేశంలో కల్లోలానికి బీజేపీ కారణమవుతోందని మంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రులను పదవీ నుంచి దించడం.. సభ్యత్వాన్ని రద్దు చేయడం.. పార్టీలను చీల్చే

3వ

## జస్టిస్ రమణను కలసిన తెలంగాణ జర్నలిస్ట్ నేతలు

ఇళ్ల సమస్య పరిష్కారం కావడంతో కృతజ్ఞతలు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 27 (సమ సమాజం):** హైదరాబాద్ వచ్చిన మాజీచీఫ్ జస్టిస్ ఎన్‌వి రమణను కలిసిన జర్నలిస్ట్ సంఘాలు ఘనంగా సత్కరించాయి. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల కేసును పరిష్కరించి నందుకు కృతజ్ఞతలు తెలిపారి. మాడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌ల నాయకత్వంలో పలువురు జర్నలిస్టులు కలసి అభినందనలు తెలిపారు. హైదరాబాద్ లో హౌజింగ్ సొసైటీ ఇళ్ల స్థలాల వ్యవహారంపై తీర్పు చెప్పి, ఎంతోకాలంగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టులకు శుభవార్త చెప్పిన సుప్రీం కోర్టు తాజా మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (టియుడబ్ల్యుజె). ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) నాయకులు కలిసి హైదరాబాద్ జర్నలిస్టుల పక్షనా కృతజ్ఞతలు తెలిపారు. శనివారం నాడు ఎన్వీ రమణ ఢిల్లీ లోని క్రిష్ణ మీనన్ మార్గ్ లో గల ఆయన నివాసంలో టియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. విరాహత్ అలీ, ఐజెయు జాతీయ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డిలు కలుసుకొని కృతజ్ఞతలు తెలపడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఎంతో ఆప్యాయంగా పలకరించి భోజనం చేసి వెళ్లాలని కోరారు. అంతేకాకుండా ఇవాళ ఎన్వీ రమణ జన్మదినం కావడంతో టియుడబ్ల్యుజె, ఐజెయు నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## సంపాదకీయం

# న్యాయవ్యవస్థ భారతీయీకరణ జరగాలి !

మన న్యాయవ్యవస్థ ఇంకా బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులకు అనుగుణంగానే సాగుతోందని, న్యాయ వ్యవస్థ లో భారతీయీకరణ జరగాలని పదవీ విరమణ చేసిన చీఫ్ జస్టిస్ ఎన్వి రమణ చేసిన వ్యాఖ్యలు సంస్కరణ లకు పునాది కావాలి. ఆయనచేసిన సూచనలు లేదా హెచ్చరికలతో న్యాయవ్యవస్థలో సమూల మార్పులు జరగాలి. ప్రధానంగా స్థానిక భాషల్లో కోర్టు కార్యకలాలపాలు సాగాలి. కోర్టుల్లో న్యాయ చర్చలను స్థానిక భాషల్లో చర్చించేలా చూడాలి. గతంలో ప్రధాని మోడీ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. కాబట్టి ఇప్పుడీ విషయంపై చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అర్థంకాని భాషలో కాకుండా ప్రజలకు అర్థం అయ్యే భాషలో న్యాయచర్చలు సాగాలి. కోర్టుతీర్పులు స్థానిక భాషల్లో విడుదల చేయాలి. పాలకులు పేదలకు న్యాయన్ని చేరువ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలి. అనేక సంస్కరణలు తీసుకుని వచ్చామని చెబుతున్న ప్రధాని మోడీ ఈ న్యాయవ్యవస్థలో ఉన్న లోటుపాట్లను గుర్తించి తక్షణ చర్యలకు పూనుకోవాలి. పార్లమెంట్ వేదికగా దీనికి శాశ్వత పరిష్కారం చూపాలి. జస్టిస్ ఎన్వి రమణ పలు అంశాలను స్పృశించారు. వాటిని సలహాలుగా తీసుకుని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగాలి. ప్రజలకు ఏంచేస్తే సత్వర న్యాయం అందుతుందో ఆలోచించాలి. అవసరమైతే మాజీ ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూ ర్తుల సలహాలు తీసుకోవాలి. ప్రతిపేదవాడికి న్యాయం అందించడమే న్యాయమూర్తి ప్రధాన లక్ష్యం కావాలని చీఫ్ జస్టిస్ ఎన్వి రమణ చేసిన వ్యాఖ్యలు దేశంలో న్యాయం పట్ల జరుగుతున్న ఆలస్యాన్ని గుర్తు చేశాయి. ఇదే సందర్భంలో పెండింగ్ కేసులు సమస్యగా మారాయని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి తీర్పులోనూ ప్రజల మనసు గెలిచేందుకు ప్రయత్నించానని చెబుతూనే... చివరిశ్వాస వరకు రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేస్తానని హామీ ఇవ్వడం ద్వారా జస్టిస్ ఎన్వీ రమణ తన నిబద్ధతను చాటుకున్నారు. నిజానికి చీఫ్ జస్టిస్‌గా రమణ బాధ్యతలు చేపట్టాక న్యాయవ్యవస్థలో అనేక మార్పులు చోటు చేసు కున్నాయి. ఇవన్నీ కూడా పేదలకు సత్వర న్యాయం అందాలన్న తపనతో చేసినవే తప్ప మరోటి కాదు. భారత న్యాయవ్యవస్థ సాధారణ ప్రజలకు ఎంతో దూరంలో నిలిచింది. ఇప్పటికీ కోట్ల మంది అణగారిన వర్గాల ప్రజలకు న్యాయ సహాయం అవసరం ఉంది. తమకు అన్యాయం జరిగిందని భావించిన ప్రతి వారూ కోర్టులకు వెళ్లడం లేదు. ఎందుఏకంటే కోర్టులకు వెళితే తేలేదేమీ లేకపోగా అనవసర కాలయాపన, డబ్బులు దండగ అన్న భావనలో ప్రజలు ఉన్నారు. అవసరమైన వెంటనే న్యాయ వ్యవస్థను ఆశ్రయించ డానికి ఇంకా వారు జంకుతూనే ఉన్నారు. న్యాయవ్యవస్థ రాజ్యాంగబద్ధమైన విధులు నిర్వర్తి స్తున్నప్పటికీ మీడియాలో తగిన ప్రచారాన్ని పొందలేదని తనకు అనుభవపూర్వకంగా అర్థమైందని రమణ చేసిన వ్ఆయఖ్యలు ఇక్కడ గమనార్హం. నిజానికి కోర్టులు, రాజ్యాంగం పట్ల ప్రజలకు సరైన అవగాహన లేదు. ప్రజలను కోర్టులకు చేరువ చేయడం రాజ్యాంగ విధి కావాలి. రాజ్యాంగం అంటే పాలకులకు సంబం ధించిన వ్యయహారంగా ఉండరాదు. న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు, విశ్వాసం కల్పించేం దుకు చర్యలు తీసుకోవాలి. ప్రజలకు న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసం కలిగించాలి. లోకల్ కోర్టులను పెంచి సత్వర న్యాయం కలిగించాలి. మన న్యాయవ్యవస్థ, ప్రొసీడింగ్స్ ఇంకా ఆంగ్లేయులనాటి విధానాలనే అవలంబి స్తోందని చీఫ్ జస్టిస్ రమణ చేసిన వ్యాఖ్యలను ఆషామాష్మగా తీసుకోరాదు. అది మన ప్రజల అవసరాలకు అనుగుణంగా లేదన్న భావనను ఆయన వ్యక్త పరచారు. మన న్యాయవ్యవస్థను భారతీయీకరించడం అత్యవసరం అంటూనే.. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా న్యాయపాలన జరగాలన్నారు. దీనిని ప్రాతిపది కగా తీసుకుని మన పాలకుల న్యాయవ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి.నిజానికి చీఫ్ జస్టిస్‌గా రమణ పదవీకాలం తక్కువే అయినా పది కాలాలపాటు గుర్తుంచుకునేలా నిర్ణయాలు తసుకున్నారు. తన కర్తవ్య నిర్వహణలో శక్తివంచన లేకుండా కృషి చేసారు. కేసుల పరిష్కారంలో కొత్త ఒరవడి తీసుకుని వచ్చారు. కోర్టుల్లో మౌలిక వసతుల కల్పనకు విశేషంగా కృషి చేసారు. వేగంగా న్యాయం అందించే దిశలో ఆధునిక మౌలికవసతుల కల్పనను అనేక చర్యలు తీసుకున్నారు. దేశంలోని హైకోర్టులు, ట్రైబ్యునళ్లలో..మూడోవంతు నియామకాలు జస్టిస్ రమణ నేతృత్వంలోని కొలీజియం చేపట్టినవేనని పదవీ విరమణ సందర్భంలో ఇతర న్యాయ మూర్తులు, న్యాయవాదులు చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. దేశంలోని న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు జస్టిస్ రమణ ఎంతో కృషి చేశారని వివరించారు. ఇకపోతే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎన్వీ రమణ ఎన్నో చారిత్రక తీర్పులను వెలువరించారు. సామాన్యుడికి అర్థమయ్యే విధంగా జస్టిస్ రమణ ఇచ్చిన తీర్పులు.. అందరికీ ఆదర్శనీయమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కొనియాడారు. జస్టిస్ రమణ పదవీకాలం దేశ న్యాయవ్యవస్థకు సువర్ణ అధ్యాయమని వారు పేర్కొనడం తెలుగువారిగా మనకంత గర్వ కారణం. హుందాతనం నిండిన వ్యక్తిత్వం, సాహిత్య సాంస్కృతిక రంగాలపై ఆసక్తి, సమన్యాయం, సామాజిక న్యాయం వంటి విలువలపై ఆధునిక దృక్పథం కలిగిన న్యాయమూర్తిగా జస్టిస్ రమణ పదవీకాలం దేశ చరిత్రలో నిలిచి పోతుందనడంలో సందేహం లేదు. ఆయన లేవనెత్తిన అంశాలు స్పృశించి ముందుకు సాగితే దేశం సర్వతో ముఖాభివృద్ధికి దోహదపడగలదు. పక్షం రోజుల ముందే ఉపరాష్ట్రపతిగా తెలుగు వాడిగా పదవీవిరమణ చేసిన వెంకయ్య నాయుడు కూడా రాజ్యసభలో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఆయన కూడా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం బలో పేతానికి అనేక చర్యలు తీసుకున్నారు. ప్రధానిగా పివి నరసింహారావు అయితే ప్రపంచ దేశాల్లో భారత్ తలెత్తుకునేలా చేశారు. వీరంతా ఎలాంటి మచ్చ లేకుండా తమ పాలనా కాలంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. తెలుగువారిగా వీరంతా అనేక సాహస కృత్యాలకు ఆద్యులయ్యారని మనమంతా గర్వించాలి. అలాగే జస్టిస్ రమణ చేసిన సూచనల ఆధారంగా న్యాయవ్యవస్థను బలోపేతంచేసి, పేదలకు సత్వర న్యాయం అందిం చేలా ప్రభుత్వాలు కృషి చేసే దిశగా అడుగులు వేయాలి. అలాగే స్థానిక భాషల్లో న్యాయ ప్రక్రియ సాగాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# తెలంగాణలో రైతు సంక్షేమానికి పెద్దపీట

### వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాల్లో ముందున్న ప్రభుత్వం

### రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ అంశాలపై వివరణ



**హైదరాబాద్, ఆగస్ట్ 27 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ అధ్యక్షతన ప్రగతి భవన్ వేదికగా రైతు సదస్సు ప్రారంభం అయ్యింది. ఈ సదస్సులో 26 రాష్ట్రల రైతు సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా వ్యవసాయరంగంలో నెలకొన్న పరిస్థితులతో పాటు.. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న వ్యవసాయం, సాగునీరు, విద్యుత్ రంగాల అభివృద్ధి, రైతు సంక్షేమ కార్యక్రమాల అమలు తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణలో అమలవుతున్న రైతు సంక్షేమ కార్యక్రమాలను సిఎం కెఇసార్ వివరించారు. ప్రధానంగా రైతుబంధు, రైతుబీమా, నీటి తీరువా ఎత్తివేత, ఉచిత విద్యుత్ అమలు, ధాన్యం సేకరణ తదితర అంశాలను సిఎం వివరించారు. రైతులకు అండగా నిలవాలన్న లక్ష్యంతో చేస్తున్న కార్యక్రమాలతో తెలంగాణలో పెరిగిన సాగు విస్తీర్ణంపైనా కెసిఆర్ వివరించారు. తెలంగాణ ప్రగతిపై రూపొందించిన డాక్యుమెంటరీని తిలకించారు. అనంతరం రైతు సంఘాల నేతలతో కలిసి సీఎం కేసీఆర్ మధ్యాహ్న భోజనం చేసాక, సదస్సు తిరిగి కొనసాగింది. తెలంగాణలో జరుగుతున్న వ్యవసాయ, సాగునీటి రంగ అభివృద్ధిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధ్యయనం చేసేందుకు ఉత్తరప్రదేశ్, తమిళనాడు, మధ్యప్రదేశ్, కర్ణాటక, పంజాబ్, జార్ఖండ్, ఒడిశా సహా 25 రాష్ట్రాలకు చెందిన వందమందికి పైగా రైతుసంఘాల నాయకులు, ప్రతినిధులు శు క్రవారం రాష్ట్రానికి చేరుకున్నారు. తెలంగాణ అమలు చేస్తున్న వ్యవసాయ విధానాలను స్వయంగా చూసేందుకు వారు వచ్చారు. నగరంలోని హోటల్ టూరిజం ప్లాజాలో బస చేసిన రైతుప్రతినిధుల బృందం.. మూడు రోజులపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించింది. శుక్రవారం సిద్దిపేట జిల్లాలో క్షేత్రస్థాయి పరిశీలనను వారు ప్రారంభించారు. మల్లన్నసాగర్, సింగాయపల్లిల్లో పర్యటించిన రైతు ప్రతినిధులు.. తెలంగాణలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం తమను ఆశ్చర్యానికి గురిచేసిందని అభిప్రాయపడ్డారు. ఇక్కడి రైతు సంక్షేమ, వ్యవసాయ, అభివృద్ధి విధానాలను తమ రాష్ట్రాల్లోనూ అమలు చేసేలా అక్కడి ప్రభుత్వాలను డిమాండ్ చేస్తామని వారు పేర్కొన్నారు.



# ముగిసిన బండి మూడోవిడత పాదయాత్ర

### నడ్డాతో కలసి భద్రకాళి అమ్మవారి దర్శనం



**వరంగల్, ఆగస్ట్ 27 (సమ సమాజం):** తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ మూడో విడత ప్రజా సంగ్రామ యాత్ర ముగిసింది. భద్రకాళి అమ్మవారి ఆలయానికి బండి సంజయ్ చేరుకున్నారు. 22 రోజులపాటు అయిదు జిల్లాల్లో పాదయాత్ర సాగింది. 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 300కు పైగా కిలోమీటర్లు నడించారు ఉత్కంఠ ఉద్రిక్తతల మధ్య మూడో విడత పాదయాత్ర ముగిసింది. ఈ క్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వరంగల్ చేరుకున్నారు. మధ్యాహ్నం 3.20 నిమిషాలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో వరంగల్ చేరుకున్న జేపీ నడ్డా భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్, తరుణ్ చుగ్, డాక్టర్ లక్ష్మణ్,డికె అరుణ, మురళీధర్ రావు తదితరులు ఉన్నారు. అనంతరం 3.45 నిమిషాలకు ఉద్యమకారుడు ప్రొఫెసర్ వెంకటనారాయణ ఇంటికి వెళ్ళారు. అక్కడి నుంచి ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ పాదయాత్ర ముగింపు సభలో జేపీ నడ్డా పాల్గొంటున్నారు. వరంగల్ సభ అనంతరం హైదరాబాద్ తిరుగు పయనం అవుతారు. ఇదిలావుంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన మూడోవిడత పాదయాత్ర హన్మకొండ జిల్లాలో ముగిసింది. ప్రజాసంగ్రామ యాత్రలో భాగంగా బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీ దగ్గర బండి సంజయ్ కు డప్పు చప్పుళ్ళు, డోలు వాయిద్యాలతో బీజేపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పాదయాత్రలో సంజయ్ ను బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ సునీల్ బన్సల్ కలిసి సంఘీభావం తెలిపారు. 30మంది గ్రాడ్యుయేట్ విద్యార్థులు సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఉదయం మామునూరు నుంచి మొదలైన పాదయాత్ర తిమ్మాపూర్ క్రాస్ రోడ్, నాయుడు పంప్ చౌరస్తా, రంగశాయిపేట, గవిచర్ల క్రాస్ రోడ్, శంభునిపేట, మిల్స్ బజార్ మీదుగా ఎంజీఎం జంక్షన్ చేరుకుంది. మధ్యాహ్నం భద్రకాళి ఆలయంలో పూజల తర్వాత పాదయాత్ర ముగింపు సభలో సంజయ్ పాల్గొంటారు.

# మునావర్ ఫరూఖీకి మరోసారి చుక్కెదురు

### అనుమతి నిరాకరించిన ఢిల్లీ పోలీసులు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 27 (సమ సమాజం):** స్టాండప్ కమెడియన్ మునావర్ ఫరూఖీకి మరోసారి చుక్కెదురైంది. ఈ నెల 28న ఢిల్లీలో నిర్వహించాల్సిన మునావర్ షోకు పోలీసులు అనుమతి నిరాకరించారు. మునావర్ షో ఢిల్లీలో మత సామరస్యాన్ని ప్రభావితం చేస్తుందన్న ఆరోపణపై ఆయన షోకు అనుమతినివ్వలేదు. కేథారనాథ్ సాహ్ని ఆడిటోరియంలోని డా.ఎస్‌పిఎం సివిల్ సెంటర్‌లో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 9.30 గంటల వరకు ఈ షో ఉండగా.. తొలుత అనుమతినిచ్చారు. తాజాగా పోలీసులు ఈ షోకు అనుమతి నిరాకరించారు. కాగా, ఇటీవల కాలంలో ఆయన షోలన్నీ రద్దు కావడం గమనార్హం. గత వారం బెంగళూరులో నిర్వహించాల్సిన ప్రదర్శనకు అనారోగ్య కారణాలతో రద్దు చేయగా.. హైదరాబాద్‌లో ప్రదర్శనకు మాత్రమే కెటిఆర్ అనుమతించారు. హిందూ దేవతలతో పాటు.. కేంద్ర మంత్రి అమిత్‌షాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై గతంలో అరెస్టు అయి బెయిల్‌పై విడుదలైన నాటి నుండి మునావర్ షోలకు అనుమతి లభించడం లేదు. ఇటీవల కాలంలో సుమారు 15 షోలు రద్దయ్యాయి. ఈ షో రద్దు కావడంపై టిఎంసి ఎంపి మెహువా మెయిత్రా మండిపడ్డారు. విహెచ్‌పి రౌడీలకు లంగిపోయి నందుకు ఢిల్లీ పోలీసులు.. వెన్నుముక లేదంటూ వ్యాఖ్యానించారు. 'నా ఇంటికి నలువైపులా గోడలు నిర్మించడం, కిటికీలు పెట్టడం నాకు ఇష్టం లేదని గాంధీజీ అన్నారు. భారత్ 75 స్వాతంత్య వేడుకలను జరుపుకున్న ఈ సమయంలో మత సామరస్యం ఈ రోజు అంత సున్నితమైపోయిందా.. ఈ కామెడీ షో ద్వారా దానికి విఘాతం కలుగుతుందా?' అని ప్రశ్నించారు.

# గుజరాత్‌లో పాలవ్యాపారి దారుణ హత్య

### మరో వర్గం మందిరపై ప్రజల దాడి

**అహ్మదాబాద్, ఆగస్ట్ 27 (సమ సమాజం):** ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో మరోసారి మత ఘర్షణలు చోటు చేసుకున్నాయి. కచ్ జిల్లాలోని భుజ్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. భుజ్‌లోని మాధాపూర్‌లో పాల వ్యాపారం నిర్వహించే ఓ యువకుడిని దారుణంగా హత్య చేశారు. దీంతో అతని మరణానికి ఓ వర్గం వారే కారణం కావడంతో ప్రజలు రెచ్చిపోయారు. వారికి సంబంధించిన ప్రార్థనామందిరంపై వారు దాడికిదిగారు.దానిని ధ్వంసం చేయడంతోపాటు దాని సమీపంలో ఉన్న షాపులపై దాడిచేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీగా బలగాలను మోహరించారు. ప్రస్తుతం పరిస్థితులు ప్రశాంతంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. ప్రజలు శాంతియుతంగా ఉండాలని, ఎలాంటి పుకార్లను నమ్మొద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు. రెండు వర్గాలపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రధాని మోదీ గుజరాత్ పర్యటన నేపథ్యంలో అల్లరు చోటుచేసుకోవడం గమనార్హం. ప్రధాని మోదీ నేడు అహ్మదాబాద్‌లో పలు అభివృద్ధిపనులను ప్రారంభించనున్నారు. సబర్మతి నదిపై నిర్మించిన పాదచారుల వంతెనను ఆరంభించారు. దానికి అటల్ బ్రిడ్జిగా నామకరణం చేశారు.

# రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో ఉద్యోగాల కుంభకోణం


### చర్యలు తీసుకోవాలంటూ

### కెసిఆర్‌కు రేవంత్ లేఖ

**హైదరాబాద్, ఆగస్ట్ 27 (సమ సమాజం):** సీఎం కేసీఆర్‌కు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో ఉద్యోగాల కుంభకోణంపై సీఎం కేసీఆర్ చర్యలు తీసుకోవాలని లేఖలో ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే చందర్, మంత్రి కొప్పుల కలిసి 800 మంది నిరుద్యోగుల నుంచి రూ.15 లక్షల వరకు వసూలు చేసి తాత్కాలిక ఉద్యోగాలిచ్చారని అన్నారు. ఈ ఉద్యోగాల నియామకంలో రూ.50 కోట్లు చేతులు మారాయని చెప్పారు. అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యే, మంత్రిని బర్తరఫ్ చేయాలని లేఖ ద్వారా ఆయన డిమాండ్ చేశారు. వారిపై క్రిమినల్ కేసులు పెట్టి సమగ్ర విచారణ జరిపించాలని సూచించారు. ఆత్మహత్య చేసుకున్న యువకుడు హరీష్ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు.

# మునుగోడు నుంచే కెసిఆర్ పతనం ప్రారంభం

- ➤లిక్కర్ స్కామ్ తరవాత ఇక కెసిఆర్, కెటిఆర్ స్కామ్‌లు
- ➤కార్యకర్తల భేటీలో మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**నల్లగొండ, ఆగస్ట్ 27 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఘాటు విమర్శలు గుప్పించారు. కేంద్రమంత్రి అమిత్‌షా వచ్చిన మరుసటి రోజే ఎమ్మెల్సీ కవిత లిక్కర్ స్కామ్ బయటపడిందని తెలిపారు. త్వరలోనే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ స్కామ్‌లూ బయట పడతాయని జోస్యం చెప్పారు. తన రాజీనామాతోనే ఫామ్‌హౌస్‌లో ఉండే సీఎం మునుగోడుకు వచ్చారని తెలిపారు. తెలంగాణలో కుటుంబ పాలనను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మునుగోడు ప్రజలు చరిత్రలో నిలిచిపోయే తీర్పు ఇవ్వాలని రాజగోపాల్‌రెడ్డి కోరారు. సీఎం కేసీఆర్ పతనం మునుగోడు నుంచే మొదలు కానుందని మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కుటుంబ పాలన పోవాలని సొంత టీఆర్ఎస్ నాయకులే చెబుతున్నారంటూ కామెంట్స్ చేశారు. 'మునుగోడు ప్రజల చేతిలో నేను ఒక ఆయుధం. ఈ ఆయుధంతో కేసీఆర్ ని అంతమొందించాల్సిన అవసరం ఉంది. విజయం మనదే. కానీ, మెజార్టీ ఎంతో మీరు చెప్పాలి. ఇక్కడ గెలిచేది రాజగోపాల్ రెడ్డి కాదు మునుగోడు ప్రజలు' అంటూ వ్యాఖ్యానించారు. శనివారం ఆయన మునుగోడులో బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో రాజగోపాల్ రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యేగా ఉండి ఏమి చేయలేకపోయానని, మునుగోడు ప్రజల అభివృద్ధి కోసమే తాను పదవికి రాజీనామా చేశానని మరోసారి స్పష్టం చేశారు. తన రాజీనామాతోనే మునుగోడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, లబ్దిదారులకు పెన్షన్లు అందుతున్నాయని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. తాను రాజీనామా చేసిన అనంతరం ఫామ్ హౌస్ లో ఉన్న సీఎం కేసీఆర్ మునుగోడు వచ్చారని ఎద్దేవా చేశారు. నెల రోజుల నుండి ఏ టీవీ పెట్టినా మునుగోడు అంశాలే ప్రసారం అవుతున్నా యన్నారు. ఇక్కడ రాజగోపాల్ రెడ్డి గెలిస్తే ప్రతి ఒక్కరూ రాజగోపాల్ రెడ్డిలే అవుతారని చెప్పారు. తన ప్రాణం పోయినా మునుగోడు ప్రజలు తల దించుకునే పని చేయనని చెప్పారు. చరిత్రలోనే నిలిచిపోయే తీర్పు మునుగోడు ప్రజలు ఇవ్వాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

# నడ్డాతో క్రికెటర్ మిథాలీ రాజ్ భేటీ

### నడ్డా ఆహ్వానం మేరకు కలిసినట్లు సమాచారం

**హైదరాబాద్, ఆగస్ట్ 27 (సమ సమాజం):** బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో భారత క్రికెట్ మహిళా జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నడ్డాకు పుష్పగుచ్ఛం అందించారు. తెలంగాణపై బీజేపీ ఫోకస్ చేసిన క్రమంలో హైదరాబాద్ వచ్చిన నడ్డాతో మిథాలీ భేటీ కావడం విశేషం. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్న బిజెపి పలువురు ప్రముఖులతో భేటీ అవుతోంది. రాజకీయ నాయకులనే కాకుండా సినీ స్టార్స్ పై కూడా ఫోకస్ పెట్టింది. ఇటీవల తెలంగాణ పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రి అమిత్ షా.. స్టార్ హీరో ఎన్టీఆర్ తో భేటీ కావడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు దారితీసింది. ఈ చర్చ కొనసాగుతుండగానే మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. వరంగల్ పర్యటన కోసం వస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా.. మిథాలీ రాజ్‌ను కలిశారు. మిథాలీ ఇటీవలే క్రికెట్‌కు గుడ్‌బై చెప్పారు. సాయంత్రం శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్ లో హీరో నితిన్ తో సాయంత్రం సమావేశం కానున్నారు.



# టిఆర్‌ఎస్‌ను సాగనంపడమే సంగ్రామ యాత్ర లక్ష్యం




(మొదటి పేజీ తరువాయి..)అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ నయా నిజాం అంటూ జేపీ నడ్డా మండిపడ్డారు. చివరి నిజాం కూడా ఇలాంటి ఆంక్షలు పెట్టే ప్రయత్నం చేశారని చెప్పారు. కేసీఆర్ కూడా మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ బాటలో నడుస్తున్నారని చురకలంటించారు. నిజాం తరహాలోనే ప్రజలు కేసీఆర్‌ను రాబోయే రోజుల్లో ఇంట్లో కూర్చోబెడుతారని జోస్యం చెప్పారు. కేసీఆర్ నిరంకుశ పాలనకు ఇదే ముగింపు అని చెప్పారు. ప్రజలు కేసీఆర్‌ను గద్దె దించడం ఖాయమన్నారు. రాష్ట్రంలో 12 జిల్లాల్లో వరదలు వస్తే కేంద్రం రూ.377 కోట్లు ఇస్తే..ఆ నిధులను సీఎం కేసీఆర్ ప్రజలకు ఇవ్వలేదని జేపీ నడ్డా అన్నారు. జల్ జీవన్ స్కీం కింద కేంద్రం రూ.3,098 కోట్లు ప్రకటించిందన్నారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లే తీసుకుందన్నారు. తెలంగాణ




అభివృద్ధికి మోదీ సర్కారు చాలా రకాలుగా నిధులు కేటాయించినా..వాటిని కేసీఆర్ డైవర్ట్ చేసి..కేంద్రంపై నిందలు మోపుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల్లో వెలుగులు నింపేందుకే బండి సంజయ్ పాదయాత్ర చేశారని జేపీ నడ్డా తెలిపారు. మూడు విడతల్లో బండి సంజయ్ చేపట్టిన పాదయాత్ర విజయవంతమైందన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కు శుభాకాంక్షలు తెలిపారు. తన పాదయాత్రలో బండి సంజయ్ టీఆర్ఎస్, కేసీఆర్.. తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని ఎత్తి చూపారని చెప్పారు. ఎంఐఎంకు భయపడి తెలంగాణ విమోచనదినాన్ని నిర్వహించటం లేదు. అవినీతికి పాల్పడినందునే కేసీఆర్‌లో భయం మొదలైంది. అవినీతి, కుటుంబ పాలనను అంతం చేయాల్సిన సమయం ఇదేనని జేపీ నడ్డా అన్నారు. ఓరుగల్లులో మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మిస్తామని జైలును కూల్చారని జేపీ నడ్డా అగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని రోజులు గడుస్తున్నా వరంగల్‌లో మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మించలేదని మండిపడ్డారు. అవినీతికి పాల్పడినందునే కేసీఆర్‌లో భయం మొదలైందని ఎద్దేవా చేశారు. అవినీతి, కుటుంబ పాలనను అంతం చేయాల్సిన సమయం వచ్చిందని జేపీ నడ్డా స్పష్టం చేశారు. సభలో పాల్గొనేందుకు వరంగల్ చేరుకున్న జేపీ నడ్డా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్, తరుణ్ చుగ్‌తో కలిసి భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు, అధికారులు జేపీ నడ్డాకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. జేపీ నడ్డా వెంట తరుణ్ చుగ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకట స్వామి కూడా ఉన్నారు. భద్రకాళి ఆలయంలో పూజలు చేసిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు, రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటనారాయణ ఇంటికి జేపీ నడ్డాతో పాటు బండి సంజయ్, రాష్ట్ర నాయకులు వెళ్లారు. అక్కడ చాయ్ తాగి, రాష్ట్ర పరిస్థితులపై చర్చించారు. ఆ తర్వాత నేరుగా హన్మకొండలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు వెళ్లారు. బండి సంజయ్ నిర్వహించిన మూడో విడత ప్రజా సంగ్రామ పాదయాత్ర వరంగల్ లో ముగిసింది. కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం ఎప్పటికప్పుడు నిధులు ఇస్తూ ఉందని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర వేల కోట్లు ఇచ్చిందని వెల్లడించారు. రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు తీసుకొచ్చిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీదేనని అన్నారు. ఈ మేరకు వరంగల్ బీజేపీ బహిరంగ సభలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. రామప్ప దేవాలయం అభివృద్ధికి రూ. 60 కోట్లు ఖర్చుచేయబోతున్నట్లు తెలిపారు. వరంగల్ స్మార్ట్ సిటీ కోసం కేంద్రం రూ. 196 కోట్ల నిధులు ఇచ్చిందని తెలిపారు. వరంగల్ పోర్టుకు రూ.5 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. వేయి స్తంభాల గుడి అభివృద్ధికి కూడా కేంద్రం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలో రోడ్ల నిర్మాణానికి కేంద్రం భారీగా నిధులు ఖర్చు చేసిందన్నారు. కేంద్రం నిధులు ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. అవన్నీ అబద్ధాలని చెప్పే దమ్ము టీఆర్ఎస్ నేతలకు ఉందా అని నిలదీశారు. కేసీఆర్‌ది తొండి ప్రభుత్వం, అబద్ధాల ప్రభుత్వామని విమర్శించారు. కేసీఆర్ కుటుంబ పాలన, టీఆర్ఎస్ అవినీతి పాలన నుంచి విముక్తి కల్పిస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని వేల కోట్ల రూపాయలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు.వరంగల్ నుంచి జగిత్యాల వరకు 4 వరుసల రహదారుల నిర్మాణం కోసం రూ. 4,000 కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నాం. వరంగల్ నుంచి ఖమ్మం వరకు 4 వరుసలు రహదారుల నిర్మాణం కోసం రూ.3360 కోట్లు ఖర్చు చేశాం. వేయి స్తంభాల గుడిలో మంటపం కూలిపోతే ఇప్పటివరకు కేసీఆర్ పట్టించుకోలేదు.. డిసెంబర్‌లోపు వేయి స్తంభాల గుడిలో మంటపం నిర్మిస్తాం. తెలంగాణలో డిఫెన్స్‌కు సంబంధించిన సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయబోతున్నాం. రూ.800 కోట్లతో వరంగల్ జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తాం. హెరిటేజ్, స్మార్ట్, అమృత్ సిటీలను ఈ ప్రాంతానికి ఇచ్చామన్నారు. వరంగల్ జిల్లాకు కేసీఆర్ ఎంత ఖర్చు పెట్టాడో సమాధానం చెప్పాలి. తెలంగాణకు కేంద్రం ఇస్తున్న నిధులపై చర్చకు మేము సిద్ధం. కేసీఆర్ నీకుకు కళ్ళుంటే చూడు, లేకుంటే నా దగ్గరికి రా. కేసీఆర్ నియంతృత్వ ప్రభుత్వాన్ని కూలదోస్తే.. బీజేపీ ప్రభుత్వం వస్తుంది. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు ఇస్తాం. మతపరమైన రిజర్వేషన్లు ఎత్తేస్తాం. టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూకటి వేళ్ళతో పెకిలించి, ఆ కుటుంబాన్ని ఫార్మ్ హౌజ్ కే పరిమితం చేస్తాం' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.కుటుంబ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పిస్తామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. వరంగల్ అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. జగిత్యాల-వరంగల్ రోడ్డు కోసం కేంద్రం రూ.4,321 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. 'వరంగల్ - ఖమ్మం రోడ్డు కోసం రూ. 3,364 కోట్లు కేంద్రం ఖర్చు చేస్తోంది. రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం కోసం కేంద్రం రూ. 20 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు తెచ్చాం. రామప్ప ఆలయ అభివృద్ధి కోసం రూ.60 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వెయ్యి స్తంభాల ఆలయ అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నాం. అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరానికి కేంద్రం వేల కోట్ల నిధులు ఇచ్చింది. వరంగల్‌లో స్మార్ట్ సిటీ కోసం కేంద్రం రూ. 196 కోట్లు ఖర్చు చేశాం. వరంగల్ జిల్లాలో సైనిక స్కూల్ రాబోతుంది. రూ.8,200 కోట్లతో రైతుల నుంచి పత్తికొనుగోలు చేస్తాం. వరంగల్ ఉమ్మడి జిల్లాలో గిరిజన వర్సిటీ ఏర్పాటు చేస్తాం. 1300 కి.మీ. రైల్వే లైన్ కోసం రాష్ట్ర సర్కార్ భూమి కేటాయించలేదు. టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలి. కేసీఆర్ కుటుంబాన్ని ఫామ్‌హౌస్‌కే పరిమితం చేయాలని కిషన్ రెడ్డి అన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ... సిఎం కెసిఆర్ ఎంతగా అడ్డుకున్నా ఆయనను వదిలి పెట్టేది లేదని, గద్దె దించే వరకు విశ్రమించేది లేదని బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు.కెసిఆర్ వెంటపడుతూనే ఉంటామని అన్నారు. హన్మకొండ సంగ్రామ ముగింపుయాత్ర సభలో ఆయన ఆవేశపూరితంగా మాట్లాడుతూ కెసిఆర్ పాలనా తీరును దుయ్యబట్టారు. బిజెపి యాత్రను అడుగడుగునా అడ్డుకున్నారని మండిపడ్డారు. ఇలాంటి పాలనకోసమా మనం పోరాడి తెలంగాణను సాధించుకుందని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి చేనుకు నీరు ప్రతి చేతికి పని కల్పిస్తామని బండి సంజయ్ తెలిపారు. అంతేకాకుండా ఉచిత విద్య..ఉచిత వైద్యానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. కేసీఆర్ కు దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు రావాలి అని సవాల్ విసిరారు. కేంద్రం ఇచ్చిన నిధులను రాష్ట్ర సర్కార్ పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. కేసీఆర్ ను వదిలిపెట్టే ప్రసక్తే లేదని.. కేసీఆర్ కోసం కరీంనగర్, అదిలాబాద్, చర్లపల్లి జైల్లలో రూంలు రెడీగా ఉన్నాయన్నారు. బీజేపీ ప్రజల కోసం, ధర్మం కోసం పనిచేస్తే.. కేసీఆర్ మాత్రం ఆయన కుటుంబం కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో మతవిద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందాలనే కుట్రలకు పాల్పడ్డారని బండి సంజయ్ ఆరోపించారు. లిక్కర్ స్కాం అంశాన్ని పక్కదారి పట్టించేందుకు అల్లర్లను తెరపైకి తెచ్చినట్లు తెలిపారు. హిందూ దేవుళ్లను తిట్టిన మునావర్ ఫారూఖీ సభకు అనుమతి ఉంటుందని కానీ.. బీజేపీ సభకు ఉండదని మండిపడ్డారు. 21 రోజుల యాత్ర తర్వాత సీఎం కేసీఆర్ కు శాంతిభద్రతలు గుర్తొచ్చాయని ఎద్దేవా చేశారు. సీఎం చెబితే గొడవలు అయితయ్.. వద్దంటే ఆగిపోతాయని చెప్పారు. బీజేపీ మతవిద్వేషాలను రెచ్చగొడుతోందని సీఎం అసత్యాలు మాట్లాడడం సిగ్గుచేటని బండి సంజయ్ అన్నారు. ప్రజాసంగ్రామ యాత్రను అడ్డుకునేందుకు టీఆర్ఎస్ ఎన్నో కుట్రలు చేసిందని.. అయితే అన్నింటిని చేధించి యాత్రను విజయవంతంగా నిర్వహిం చినట్లు తెలిపారు. బీజేపీ కార్యకర్తలపై పీడీ యాక్టులు పెడుతున్నారన్న ఆయన బైంసాలో కార్యకర్తలు ఎంఐఎంను తట్టుకుని నిలబడ్డారని చెప్పారు. బీజేపీ కార్యకర్తలను కేసులతో బెదిరించలేరని బండి సంజయ్ మండిపడ్డారు. కుట్రలను తట్టుకొని ధర్మం కోసం బీజేపీ కార్యకర్తలు పనిచేస్తున్నారన్నారు. బీజేపీ కార్యకర్తలు బతికినన్నాళ్లు ధర్మం కోసమే బతుకుతారన్నారు. ట్రాఫిక్ నిబంధనల పేరుతో బీజేపీ సభలను కేసీఆర్ ప్రభుత్వం అడ్డుకుంటోందని మండిపడ్డారు. బీజేపీ తెలంగాణ అభివృద్ధి కోసమే మాట్లాడుతుంది.



నన్ను అరెస్ట్ చేసినా నా యాత్ర ఆపలేదు. కార్యకర్తలను, పార్టీ శ్రేణులను కేసులు, అరెస్టులతో ఇబ్బందులు పెట్టారు. ఎప్పుడు చస్తామో, ఎన్నాళ్లు బతుకుతామో చెప్పలేని పరిస్థితులు. కేసీఆర్‌ను వదిలే ప్రసక్తేలేదు.. రక్తం సలసల మరుగుతోంది' అంటూ ఆయన వ్యాఖ్యానించారు. అభివృద్ధి విషయంలో చర్చకు మేం సిద్ధం. కేసీఆర్ మోసాలను ప్రజలు గమనిస్తున్నారు' అని బండి సంజయ్ అన్నారు.ఎంపీ ధర్మపురి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్ని అడ్డంకులు సృష్టించినా మూడో విడత ప్రజా సంగ్రామ యాత్ర విజయవంతంగా పూర్తయ్యిందని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ అన్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ ఎన్ని అడ్డంకులు సృష్టించినా బీజేపీ ఎదుగుదలను ఎవరూ ఆపలేరన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వమే రాబోతుందని అన్నారు. హన్మకొండలోని ఆర్ట్స్, సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బీజేపీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వంపై ఎంపీ అర్వింద్ నిప్పులు చెరిగారు. మునుగోడు నియోజకవర్గం లో ఇటీవల టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్... బీజేపీపై, ప్రధాని నరేంద్ర మోడీపై చేసిన విమర్శలను ఎంపీ అర్వింద్ తీవ్రంగా ఖండించారు. సీఎం కేసీఆర్ పై విమర్శలు చేస్తూ రాష్ట్ర ప్రజలకు, బీజేపీ కార్యకర్తలకు ఎంపీ అర్వింద్ కొన్ని ప్రశ్నలు వేశారు. రాష్ట్రం వస్తే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, దళితులకు మూడు ఎకరాలు ఇస్తానని చెప్పి మోసం చేసిన కేసీఆర్ కావాలా..? లేక దళితుడిని రాష్ట్రపతిని, గిరిజన మహిళను రాష్ట్రపతిని చేసిన నరేంద్ర మోడీ కావాలా.. అని ప్రశ్నించారు. ప్రతిరోజూ 18 గంటలు ఫాం హౌజ్ లోనే ఉండే కేసీఆర్ కావాలా..? లేక 18 గంటలు కష్టపడే ప్రధాని నరేంద్ర మోడీ కావాలా.. అన్నారు. వరి వేస్తే ఉరి అని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ కావాలా..? 2021 వరకూ కోటి 42 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యాన్ని కొనుగోలు చేసిన ప్రధాని నరేంద్ర మోడీ కావాలా..? అని ప్రశ్నించారు. భారీ వర్షాలు, వరదలతో పంటలు కొట్టుకుపోతే పట్టించుకోని సీఎం కేసీఆర్ కావాలా..? లేక ఫసల్ బీమా పథకంతో రైతులను ఆదుకుంటున్న మోడీ కావాలా.. అని అన్నారు. నిరుపేదలకు, ఇండ్లు లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇంట్లు కట్టించి, ఇస్తానని చెప్పి మోసం చేసిన కేసీఆర్ కావాలా..? లేక దేశంలోని నిరుపేద మహిళలకు 3కోట్ల 20లక్షల ఇండ్లు కట్టించి ఇచ్చిన మోడీ కావాలా..? అంటూ ప్రశ్నించారు. కరోనా సమయంలో నిరుపేద, సామాన్య మధ్యతరగతి ప్రజల కోసం ఎటువంటి ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టని సీఎం కేసీఆర్ కావాలా..? లేక 20 కోట్లకు పైగా కుటుంబాలను ఆదుకుంటున్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టిన మోడీ కావాలా..? అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అవమాన పర్చి.. కొత్త రాజ్యాంగం కావాలని చెప్పిన కేసీఆర్ కావాలా..? లేక అంబేద్కర్ రాజ్యాంగాన్ని పూర్తి స్థాయిలో అమలు పరుస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ కావాలా..? అని ప్రశ్నించారు. ? గత 8 ఏళ్ల నుంచి ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వని కేసీఆర్ కావాలా..? మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ముద్ర లోన్ల ద్వారా లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న మోడీ కావాలా..? ? అవినీతి జాతిపిత (కేసీఆర్ ను ఉద్దేశించి) కావాలా..? అవినీతిపై పోరాటం చేస్తున్న మోడీ కావాలా..? అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని రూ.5 లక్షల కోట్ల అప్పుల తెలంగాణగా మార్చిన కేసీఆర్ కావాలా..? ప్రపంచలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని మార్చిన మోడీ కావాలా..? అని ప్రశ్నించారు.

## దేశంలో వనరుల వినియోగంలో కేంద్రం విఫలం

(మొదటి పేజీ తరువాయి..) డాక్యుమెంటరీలోని దృశ్యాలు, వివరణలు అద్దం పడుతున్నాయని అభిప్రాయపడ్డారు. తమ రాష్ట్రాల్లోనూ ఇలాంటి రైతు సంక్షేమ పథకాలుంటే ఎంతో అభివృద్ధి చెందేవారమని సీఎం కేసీఆర్ తెలంగాణకే కాదు, తమ రాష్ట్రాల్లోని రైతుల గురించీ ఆలోచన చేస్తే బాగుంటుందని వారు ఆకాంక్షించారు. 75 ఏళ్లు గడిచినా కేంద్ర ప్రభుత్వ పాలన గాడిలో పడకుండా ప్రజల ఆకాంక్షలు సంపూర్ణంగా నెరవేరకుండా పోవడానికి కారణాలు అన్వేషించా లన్నారు. స్వాతంత్య పోరాటం ముగిసిన దశాబ్దాల తర్వాతా దేశంలో అనేక వర్గాలు తమ ఆకాంక్షలు, హక్కులను నెరవేర్చుకునేందుకు ఇంకా ఎందుకు పోరాటాలకు సిద్ధపడుతున్నారో ఆలోచించాల్సి ఉందని చెప్పారు. దేశంలోని రైతు సమస్యలకు ఎందుకు పరిష్కారం దొరకడం లేదో.. దేశ పాలకులు ఎందుకు వైఫల్యం చెందుతున్నారో చర్చించుకోవాల్సిన అవసరం ఉందని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాల్సిన వారు.. నిర్లక్ష్యం వహిస్తుండటం, ప్రజల కోసం పనిచేసే వారిని పాలకులే ఇబ్బందులకు గురిచేసే విధానం దేశంలో కొనసాగుతుండటం మన దురదృష్టకరమని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితి నుంచి దేశాన్ని బయటపడేసేందుకు ప్రజాసంక్షేమం కోరుకునే శక్తులంతా సంఘటితం కావాల్సి ఉందని తెలిపారు. అడ్డంకులను అధిగమిస్తూ ఐక్యంగా లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉందని వివరించారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రైతులందరికీ ఉచితంగా విద్యుత్, సాగునీరు అందిస్తున్నా కేంద్రం దేశవ్యాప్తంగా ఎందుకు అమలు చేయట్లేదని కేసీఆర్ ప్రశ్నించారు. రైతులు కూర్చొని మాట్లాడుకోవడానికి రాష్ట్రంలో ఉన్నట్లు దేశంలో ఎక్కడైనా కిసాన్ మంచ్‌లు ఉన్నాయా అని నిలదీశారు. విద్యుత్ ఉండి, కష్టపడే రైతులున్నా దేశంలో వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు, కేంద్ర పాలకుల నిర్లక్ష్యం వంటి విషయాలను విశ్లేషించుకొని, చర్చించాల్సిన అవసరం ఉందని సీఎం కేసీఆర్ అభిప్రాయపడ్డారు. ఇందులో రైతు సమన్వయ సమితి నేత పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూధనాచారి తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా యూయు లలిత ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి..)నియమితులయ్యారు. అనేక కీలక కేసుల తీర్పుల్లోనూ జస్టిస్ లలిత్ భాగస్వామిగా ఉన్నారు. జస్టిస్ లలిత్‌తో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సీజేఐగా ప్రమాణం చేయించారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సహా పలువురు కేంద్రమంత్రులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లలిత్ 74 రోజులపాటు పనిచేయనున్నారు. జస్టిస్ యుయు లలిత్ దేశంలో తీవ్ర సంచలనం సృష్టించిన ముమ్మారు తలాక్ సహా అనేక కీలక అంశాల్లో తీర్పు వెలువరించిన ధర్మాసనాల్లో లలిత్ భాగస్వామి. బార్ నుంచి నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులై అనంతరం సీజేఐ అయిన రెండో వ్యక్తిగా ఘనత సాధించారు. 1971 జనవరిలో 13వ భారత ప్రధాన న్యాయమూర్తి అయిన జస్టిస్ ఎస్.ఎం.సిక్రీ నేరుగా సుప్రీంకోర్టు జడ్జి అయిన మొదటి న్యాయవాది. 1964లో ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2014, ఆగస్టు 13న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితుల య్యారు. అప్పటి నుంచి అనేక కీలక తీర్పుల్లో భాగస్వామి అయ్యారు. ముమ్మారు తలాక్ విధానంలో విడాకులు చెల్లుబాటు కావని, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ 2017లో 3-2 మెజారిటీతో తీర్పు వెలువరించిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ యుయు లలిత్ సభ్యుడు. కేరళలోని శ్రీ పద్మనాభస్వామి ఆలయం నిర్వహణ హక్కు అప్పటి రాజకుటుంబానికి ఉంటుందని జస్టిస్ యుయు లలిత్ నేతృత్వంలోని ధర్మాసనం రూలింగ్ ఇచ్చింది.

## కొట్టుకు చావమని ఏ దేవుడు చెప్పాడు

(మొదటి పేజీ తరువాయి..)వద్దనే ఆగిపోయాం. ఇది సిగ్గుపడాల్సిన పరిస్థితి. కానీ తెలంగాణ రాష్ట్రం దానికి భిన్నంగా పని చేస్తుంది. తెలంగాణ గత 8 ఏండ్లలో సాధించిన విజయాలు, నిధుల విషయంలో ఒక్క మాటలో చెప్పాలంటే.. మీరు బుద్ధి జీవులు కాబట్టి చెప్తున్నాను. 140 కోట్ల భారతదేశ జనాభాలో మనం కేవలం 4 కోట్లు మాత్రమే. మనం దేశానికి 5 శాతం జీడీపీ కంట్రిబ్యూట్ చేస్తున్నాం. ఇది పురోగతి అంటే అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## కెసిఆర్ సంక్షేమాన్ని దెబ్బతీస్తున్న బిజెపి

(మొదటి పేజీ తరువాయి..)కుట్రలు చేస్తూ బీజేపీ తన ఫ్యూడల్ లక్షణాలను బయట పెడుతోందని మంత్రి జగదీష్ రెడ్డి విమర్శించారు. బీజేపీ కుట్రలను దేశ ప్రజలు నిలదీసి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్నారు. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా చివరకు ధర్మమే గెలుస్తుందని చెప్పారు. జనమే లేని బీజేపీ సభలను అడ్డుకునే అవసరం తమకు లేదన్నారు. అనుమతులు లేకుండా సభలు జరగవన్న విషయం బీజేపీకి తెలియదా.. అని మంత్రి జగదీష్ రెడ్డి ప్రశ్నించారు. ఇదిలావుంటే ప్రధాని నరేంద్రం మోడీ సొంత రాష్ట్రం గుజరాత్ లో వృద్దులకు ఇచ్చే పింఛన్ కేవలం 750 రూపాయలు మాత్రమే నని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. అందులో వికలాంగులకు ఇచ్చే పింఛన్ 600 రూపాయలు మాత్రమేనని ఆయన తేల్చిచెప్పారు. బిజెపి పాలిత రాష్ట్రలలో మొదటిది ఈ దేశంలో పెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్ లో అటు వృద్దులు, వితంతువులతో పాటు వికలాంగులకు ఇచ్చే పింఛన్ మొత్తం కూడ అక్షరాల 600 రూపాయలు మాత్రమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన నూతన ఫించన్లను సూర్యాపేట పురపాలక సంఘం, సూర్యాపేట రూరల్ లలో లబ్దిదారులకు శనివారం ఆయన అందజేశారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి జగదీష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ?. అదే బీజేపీ రెండు దశాబ్దాలుగా పాలిస్తున్న మధ్యప్రదేశ్ లో అందరికి సర్వసమానంగా 600 రూపాయలుపింఛన్లు పేరు మీద విదిలిస్తుండగా డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ దొడ్డి దోవన అధికారంలోకి వచ్చిన కర్ణాటకలోను ఇచ్చే పింఛన్ 600 మాత్రమేనని ఎద్దేవాచేశారు. తెలంగాణ ప్రాంతంలోనూ రాష్ట్రం ఏర్పాటుకు ముందు సాలీనా 800 కోట్లు ఇస్తుండగా రాష్ట్రం ఆవిర్భావం తరువాత అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పింఛన్ల పేరుతో సాలీనా 12,000 కోట్లు చెల్లిస్తుందన్నారు. వృద్ధులకు, వితంతువులతో పాటు ఒంటరి మహిళలకు 2,016 రూపాయలు, దివ్యాంగులకు 3,016 రూపాయలు పింఛన్ ఇస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. డబుల్ ఇంజిన్ల పేరుతో రాజకీయం వెలగ బెడుతున్న కమలనాధులకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లే ట్రబుల్ ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.ఈ పింఛన్లతోటే బిజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడ తిరుగుబాటు సంభవిస్తుందో నన్న మీమాంస వారిని వెంటాడుతున్నట్లుందన్నారు. అందుకే తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను అడ్డుకునేందుకు కేంద్రం కిందా మీద పడుతుందని దుయ్యబట్టారు. బ్యాంకుల నుండి రుణాలు మంజూరు కాకుండా అడ్డుకోవడం, కేంద్రం ఇవ్వాల్సిన నిధులను ఇవ్వక పోవడం,రాష్ట్రం నుండి ముక్కు పిండి వసూలు చేసిన పన్నులు తిరిగి రాష్ట్రానికి అందించకుండా మొకలడ్డుతున్నారనిఆయన మండిపడ్డారు. అయినా వెనక్కి తగ్గకుండా కొత్తగా మంజూరు అయిన 10 లక్షల ఫించన్లను కలుపుకుని మొత్తం తెలంగాణ రాష్ట్రంలో 46 లక్షల మంది లబ్దిదారులకు పింఛన్లు మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ దన్నారు. కొత్తగా మంజూరు అయిన పింఛన్లతో కలుపుకుని ఒక్క సూర్యాపేట నియోజకవర్గం లోనే 38068 మంది లబ్దిదారులు ఉండగా నెలకు 9.1 కోట్లు సాలీనా 108 కోట్లు చెలిస్తున్న విషయాన్ని ఆయన వెల్లడించారు. 2014 నాటికి 28,188 మంది లబ్దిదారులకు నెల ఒక్కింటికీ కేవలం 3.5 కోట్లు ఉండగా ప్రస్తుతం లబ్దిదారుల సంఖ్య 38,068 మందికి నెల ఒక్కింటికీ 9.1 కోట్లు నేరుగా పింఛన్ దారుల అకౌంట్ లో ఎటువంటి పైరవీలకు ఆస్కారం లేకుంటా జమ అవుతున్నా యన్నారు. అంతే గాకుండా ఋణమాఫీ పేరుతో 25 వేల కోట్ల పంట రుణాలను మాఫీ చేసిన చరిత్ర తెలంగాణ సిఎం కేసీఆర్ కే దక్కిందన్నారు. అందుకు భిన్నంగా బిజెపి నేతలు అవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. అన్నింటికీ మించి తెలంగాణ ఏర్పడ్డాక ముఖ్యమంత్రి మార్గదర్శనంలో సరఫరా అవుతున్న 24 గంటల నాణ్యమైన విద్యుత్ కూడా బిజెపి పాలకులకు కంటగింపుగా మారింద న్నారు. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్ లో కరెంట్ సరఫరా కేవలం ఆరు గంటల మాత్రమే నన్నారు. అక్కడ అరనిమిషం కుడా ఉచిత విద్యుత్ ఇవ్వకపోగా వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టి రీడింగ్ ప్రకారమే రైతాంగం నుండి ముక్కు పిండి మరీ విద్యుత్ చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. ఎగిరెగిరి పడుతున్న ఈ బిజెపి పాలనలోనే కదా ఎక్కడో 400 రూపాయలు ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ఒక్కసారిగా 1100 పై చిలుకు ఎగబాకిందని ఆయన తెలిపారు. అంతే గాకుండా అటు డీజిల్ ఇటు పెట్రోల్ ధరల పెరుగుదల కు హద్దు అనేది లేకుండా పోయిందన్నారు.అటువంటి పార్టీ నేతలు ఇటువంటి సంక్షేమాన్ని అడ్డుకోజూస్తున్నప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ కు అండగా నిలబడాల్సింది పథకాలు అనుభవిస్తున్న లబ్దిదారులేనని మంత్రి జగదీష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ ఐసెట్ 2022 ఫలితాలు విడుదల

### తొలి 3 ర్యాంకులను ఏపీ విద్యార్థుల కైవసం

**వరంగల్, ఆగస్ట్ 27 (సమ సమాజం):** తెలంగాణ ఐసెట్ 2022 ఫలితాలు విడుదలయ్యాయి. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఐసెట్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) ఫలితాలు విడుదలయ్యాయి. కేయూ వీసీ రమేశ్ ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 61,613 మంది విద్యార్థులు ఈ ఏడాది ఐసెట్?లో అర్హత సాధించారు. ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన దంతాల పూజిత్ వర్ధన్ మొదటి ర్యాంకు సాధించగా.. కడప జిల్లాకు చెందిన అంబవరం ఉమేశ్ చంద్రరెడ్డి రెండో ర్యాంకు కైవసం చేసుకున్నారు. మొత్తం మీద తొలి 3 ర్యాంకులను ఏపీ విద్యార్థులు దక్కించుకోవడం గమనార్హం. తెలుగు రాష్ట్రాల్లో జులై 28న తెలంగాణలో 10, ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. మొత్తం 76,160 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. మొదటి విడత పరీక్షకు 90.93 శాతం, రెండో విడత పరీక్షకు 91.43 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా ఐసెట్ ప్రిలిమినరీ కీని ఆగస్టు 4న విడుదల చేసిన విషయం తెలిసిందే.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### పెన్షన్ల పంపిణీలో మంత్రి గంగుల కమలాకర్



**కరీంనగర్, ఆగస్ట్ 27 (సమ సమాజం):** పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శనివారం కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో బొమ్మకల్, గోపాల్ పూర్, దుర్శేడ్ గ్రామాలకు చెందిన 596 మంది లబ్దిదారులకు నూతన ఆసరా పింఛను కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ.. పేదల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,15,000 పెన్షనర్లు ఉండగా కొత్తగా 31,822 మందికి పెన్షన్లు మంజూరు చేశామన్నారు. తెలంగాణ రాకముందు పింఛను మంజూరు కోసం దరఖాస్తు ఇచ్చి దండం పెట్టినా గత పాలకులు పెన్షన్లు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. కొత్తగా పెన్షన్ రావాలంటే మరొకరి చావు కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వయం పాలనలో అర్హులైన అందరికీ ఆసరా పింఛన్లు ఇవ్వాలని సీఎం కేసీఆర్ చెప్పారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఆసరా పెన్షన్ అందించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీలత, కరీంనగర్ ఎంపీపీ లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఉచితాలు వద్దంటున్న బిజెపికి బుద్ధి చెప్పాలి

### మిరుదొడ్డిలో పెన్షన్లు మంజూరులో హరీష్ రావు



**సిద్దిపేట, ఆగస్ట్ 27 (సమ సమాజం):** ఉచితాలు బంద్ చేయాలని చెబుతున్న బిజెపి ప్రభుత్వాన్ని మన తెలంగాణ రాష్ట్ర ప్రజలు బంద్ చేయాలని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు పిలుపునిచ్చారు. సిద్ధిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలో ఇప్పటికే 10,041 ఉండగా, అదనంగా 1103 మంది అర్హులైన లబ్దిదారులకు నూతన ఆసరా పింఛన్లను మంత్రి పంపిణీ చేశారు. మంత్రి వెంట మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ రోజా శర్మ, ఎమ్మెల్సీలు యాదవ రెడ్డి, ఫారూఖ్ హుస్సేన్, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, నియోజకవర్గ పరిధిలోని ప్రముఖ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలు తెచ్చి 750 మంది రైతులను పొట్టన పెట్టుకున్నదని మంత్రి గుర్తుచేశారు. బడా బడా పారిశ్రామిక వేత్తలకు, పెట్టుబడి దారులకు ఓవైపు 10 లక్షల కోట్లు బిజెపి ప్రభుత్వం మాఫీ చేస్తూ.. మరోవైపు ఉచితాలు వద్దని అనవసర రాద్ధాంతం చేస్తున్నదని మండిపడ్డారు. దుబ్బాక నియోజకవర్గంలో మొత్తం 52, 722 మంది లబ్దిదారులకు ఆసరా ఫించన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వంకు కళ్లు కనపడక కాళేశ్వరం నీళ్లు పారలేదనీ, అనవసర విమర్శలు చేస్తున్నదని తెలిపారు. బిజెపి ప్రభుత్వానివన్నీ.. పచ్చి అబద్దాలు జూటా మాటలు వారి మాయలో పడొద్దని ప్రజలకు మంత్రి హరీశ్ రావు సూచించారు.



# ఓల్డ్ సిటీని గోల్డ్ సిటీగా అభివృద్ధి

- చాంద్రాణగుట్ట ఫ్లై ఓవర్‌తో ట్రాఫిక్ కష్టాలకు చెక్
- నేరుగగా శంషాబాద్‌కు చేరుకునే వెసలుబాటు
- లాంఛనంగా ప్రారంభించిన మంత్రి హమ్మద్ అలీ

**హైదరాబాద్, ఆగస్ట్ 27 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ హయాంలో ఓల్డ్ సిటీని గోల్డ్ సిటీగా అభివృద్ధి చేస్తున్నా మని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ స్పష్టం చేశారు. పై వంతెనలను నిర్మించడం ద్వారా ట్రాఫిక్ కష్టాలను దూరం చేస్తున్నామని అన్నారు. గతంలో రోడ్ఉల, ఫ్లై ఓవర్లకు ఇంతగా శ్రద్ధ తీసుకున్న దాఖలాలు లేవన్నారు. చంద్రాయణగుట్ట ఫ్లై ఓవర్‌తో హైదరాబాద్ నగరవాసులకు మరో పైవంతెన అందుబాటులోకి వచ్చింది. పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట పైవంతెనను హోంశాఖ మంత్రి మహమూద్ అలీ లాంఛనంగా ప్రారంభించారు. రూ.45.79 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ వంతెనతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎల్బీనగర్ మీదుగా నల్గొండ, వరంగల్ వెళ్లేందుకు ప్రయాణం సులభతరం కానుంది. గతంలోనే దీనిని ప్రారంభించాల్సి ఉండగా పాతబస్తీ అల్లర్ల కారణంగా వాయిదా పడింది. కెటిఆర్ ప్రారంభోత్సవానికి రావాల్సిఉండగా హోంమంత్రి దీనిని ప్రారంభించడం విశేషం. హైదరాబాద్ పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట పైవంతెనను హోం శాఖ మంత్రి మహమూద్ అలీ శనివారం ప్రారంభించారు. ఈ నెల 23వ తేదీనే వంతెన ప్రారంభం కావాల్సి ఉండగా.. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలు, పాతబస్తీలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఈ రోజుకు వాయిదా వేశారు. ఉదయం 11 గంటలకు మహమూద్ అలీ లాంఛనంగా ఈ వంతెనకు శ్రీకారం చుట్టారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీతో పాటు పలువురు ఎంఐఎం నేతలు, తెరాస కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.45.79 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ వంతెనతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎల్బీనగర్ మీదుగా నల్గొండ, వరంగల్ వెళ్లేందుకు ప్రయాణం సులభతరం కానుందని హోం మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. 4 లైన్లు..





674 మీటర్ల పొడవు..: ఇక్కడి చౌరస్తాలోని ఒక కూడలిపై 2007లోనే పైవంతెనను ప్రారంభించారు. మరోవైపున్న బంగారు మైసమ్మ దేవాలయ కూడలిలో ట్రాఫిక్ కష్టాలు పెరగడంతో పాత వంతెనను పొడిగించాలని బల్దియా నిర్ణయించింది. ఇందుకు జీహెచ్ఎంసీ 2020లో శ్రీకారం చుట్టింది. పనులు తాజాగా పూర్తవడంతో హోంమంత్రి మహమూద్ అలీ నేడు ప్రారంభించారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎల్బీనగర్ మీదుగా నల్గొండ, వరంగల్ వెళ్లేందుకు ఈ పైవంతెన ఉపయోగపడనుంది. రూ.45 కోట్ల 79 లక్షల వ్యయంతో రెండు వైపుల 4 లైన్లతో 674 మీటర్ల పొడవుతో ఫ్లైఓవర్‌ను నిర్మించారు. ఇక ఆగకుండా వెళ్లిపోవచ్చు..: కందికల్ గేట్, బర్కాస్ జంక్షన్ల వద్ద ఆగకుండా నేరుగా వంతెన పైనుంచి వెళ్లిపోవచ్చు. ఓవైసీ జంక్షన్ మీదుగా ఎల్బీనగర్ వరకు.. ఎల్బీనగర్ నుంచి శంషాబాద్ వైపు సకాలంలో చేరేందుకు వీలుకానుంది. ఎస్ఆర్‌డీపీ ద్వారా నగరంలో నలువైపులా జీహెచ్ఎంసీ 41 పనులు చేపట్టింది. చాంద్రాయణగుట్ట పైవంతెనతో ఇప్పటికే 30 పనులు పూర్తికాగా.. మరో 11 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు.. మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడం కోసం నగరంలో అవసరమైన చోట పైవంతెనలు, అండర్ పాస్?లు, ఆర్ఓబీలను.. ప్రభుత్వం దశల వారీగా అందుబాటులోకి తెస్తున్న విషయం తెలిసిందే.






## పాపం నభా నటేశ్..!

### అవకాశాల కోసం ఎదురుచూపు

నన్నుదోచుకుందువటే సినిమాతో టాలీవుడ్‌కు హీరోయిన్‌గా పరిచయమైన బెంగుళూరు భామ నభా నటేష్, ఆ తర్వాత అదుగో సినిమాలోనూ నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే, ఈ రెండు సినిమాలతో రాని స్టార్ ఇమేజ్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో వచ్చేసింది. ఇందులో తెలంగాణ యాసలో మాట్లాడుతూ పలికిన సంభాషణలు మాస్ ఆడియన్స్‌కి బాగా ఎక్కేశాయి. గ్లామర్ ట్రీట్ ఇవ్వడంలోనూ నభా ఎలాంటి హద్దులు పెట్టుకోకుండా ఆకట్టుకుంది. దాంతో తెలుగులో వరుసగా అవకాశాలు దక్కాయి. అయితే, ఈ ఇస్మార్ట్ బ్యూటీ ఇస్మార్ట్ శంకర్ మూవీతో వచ్చిన సక్సెస్‌ను నిలబెట్టుకోలేకపోయింది. అవకాశాలు వచ్చాయి కదా అని చక చకా సినిమాలు ఒప్పకుంది. అవేమో వరుసగా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడ్డాయి. మాస్ మహారాజ రవితేజతో డిస్కోరాజా, సాయి ధరమ్ తేజ్ సరసన సోలో బ్రతుకే సో బెటర్, బెల్లంకొండ శ్రీను సరసన అల్లుడు అదుర్స్, నితిన్ సరసన మాస్ట్రో సినిమాలలో హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాలలో ఒక్క సోలో బ్రతుకే సో బెటర్ అంతంత మాత్రం. మిగతా సినిమాలన్ని ఫ్లాప్‌గా మిగిలాయి.కథ, అందులో తన పాత్ర ఏంటో కూడా నభా సరిగ్గా పట్టించుకోకుండా అవకాశాలు వచ్చాయి కదా, రెమ్యునరేషన్ అందుతుంది కదా అనే ఆలోచనతోనే సినిమాలు ఒప్పకొని ఉంటుందనే అభిప్రాయాలు చాలామందిలో కలిగాయి. ఆచితూచి అడుగేసి మంచి కథలను గనక ఎంచుకుంటే ఇప్పుడు నభా చేతిలో ఒకటో రెండో సినిమాలైనా ఉండేవి. ప్రస్తుతం అమ్మడు అవకాశాల కోసం ఎదుచూస్తోంది. అందుకే, మేకర్స్‌ను ఆకట్టుకునందుకు ఎప్పటికప్పుడు రకరకాల గ్లామర్ ఫొటో షూట్స్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేస్తోంది. ఇది చూసిన నెటిజన్స్.. ఇస్మార్ట్ బ్యూటీ ఫొటో షూట్సే తప్ప కొత్త సినిమా కబురెప్పుడు.. అంటూ కామెంట్స్ చేస్తున్నారట. మరి ఆ కబురెప్పుడు చెబుతుందో చూడాలి.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in